
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

సోమవారం 8 ఏప్రిల్ 2024



అనకాపల్లిలో వారాహి విజయభేరి యాత్రకు బ్రహ్మరథం

- అభిమాన నేతపై దారి పొడవునా పూలవర్షంతో స్వాగతం
- అడుగడుగునా మంగళ హారతులు పట్టిన మహిళలు
- గజమాలతో అభిమానుల ఘన సత్కారం

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం అనకాపల్లి నెహ్రూ చౌక్‌లో నిర్వహించిన వారాహి విజయభేరి యాత్రకు జనం బ్రహ్మరథం పట్టారు. వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, కూటమిలోని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలతో అనకాపల్లి జన సంద్రాన్ని తలపించింది. సుంకరమెట్ట కూడలి నుంచి నెహ్రూచౌక్ వరకు ర్యాలీగా వచ్చిన జనసేనానికి అఖండ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నెహ్రూ చౌక్‌లో జరిగిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిప్పులు చెరిగారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో వైసీపీ కోడి ఒక గుడ్డు పెట్టింది, ఒక డిప్యూటీ సీఎంను ఇచ్చింది కానీ ఒక మంచి రోడ్డు వేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. అనకాపల్లి ఎంపీగా సీఎం రమేశ్‌ను గెలిపించుకుంటే కేంద్రం సహకారంతో ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ఉత్తరాంధ్ర సమస్యలపై తరచూ గళమెత్తే నేత కొణతాల రామకృష్ణ ఎమ్మెల్యేగా గెలిస్తే ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

అనకాపల్లి నెహ్రూ చౌక్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరైన అశేష ప్రజానీకం



జనసేనానికి నీరాజనం



అనకాపల్లిలో జనసేనాని పవన్‌కల్యాణ్ రోడ్‌షోలో పాల్గొన్న అశేష జనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7: వారాహి విజయభేరి యాత్రలో భాగంగా ఆదివారం సాయంత్రం అనకాపల్లి వచ్చిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు. జలగలమదుం జంక్షన్ సమీపాన ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు పవన్‌కల్యాణ్ హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 3.45 గంటలకు వచ్చారు. ఆయనకు బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, జనసేన అభ్యర్థులు పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, కూటమి పార్టీల ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. పవన్‌కల్యాణ్‌ను కొణతాల రామకృష్ణ సత్కరించి వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం పలువురు నాయకులు కొణతాల సమక్షంలో జనసేనలో చేరారు. సాయంత్రం 5.25 గంటలకు వారాహి విజయయాత్ర హెలీప్యాడ్ నుంచి ప్రారంభమైంది. ఈ ర్యాలీ సత్తెమ్మ తల్లి ఆలయ ముఖద్వారం, ఆంధ్రాబ్యాంక్ రోడ్డు, వన్‌వే ట్రాఫిక్ జంక్షన్, చేపల బజారు మీదుగా నెహ్రూచౌక్‌కు సాయంత్రం 6.30 గంటలకు చేరుకుంది. ఓపెన్ టాప్ వాహనం పైనుంచి ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. దారి పొడవునా అభిమానులు, పార్టీ నాయకులు పూలవర్షం కురిపించారు. పలుచోట్ల మహిళలు మంగళహారతులు ఇచ్చారు. రింగు రోడ్డు జంక్షన్‌లో ఒక యువతి చేతిలో హారతిని ... మిగతా 6వ పేజీలో

కూటమితోనే భవిష్యత్తు

- విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయండి
- వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి

వారాహి విజయభేరి సభలో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్



అనకాపల్లి/ కొత్తూరు/ అనకాపల్లి టౌన్ ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే భవిష్యత్తు బాగుంటుందని, ప్రజలంతా విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. వారాహి విజయభేరి యాత్రంలో భాగంగా ఆదివారం అనకాపల్లి నెహ్రూ చౌక్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. యువతకు ఉపాధి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తి, మూతపడిన చక్కెర కర్మాగారాల పునరుద్ధరణ, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ మన ముందున్న సవాళ్లని, కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే ఇవన్నీ సాధ్యమవుతాయన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమే జనసేన పోరాడుతోందని, అధికారం కోసం కాదని పవన్ స్పష్టం చేశారు.

నూకాలమ్మ జాతరకు రాష్ట్రస్థాయి గుర్తింపు..

అనకాపల్లి నూకాలమ్మ జాతరను రాష్ట్ర స్థాయి పండగలా నిర్వహిస్తామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఇక్కడ ప్రజలకు రెండు పూటలా స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని, రోడ్డు విస్తరణలో భవనాలు కోల్పోయిన వారికి టీడీఆర్‌లు ఇస్తామన్నారు.

కోడిగుడ్డు మంత్రిని తట్టుకోలేని సీఎం

కోడిగుడ్డు మంత్రి అవినీతిని తట్టుకోలేకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమర్‌నాథ్‌కు అనకాపల్లిలో టికెట్టు ఇవ్వలేకపోయారని పవన్ ఆరోపించారు. కశింకోట మండలం విస్సన్నపేటలో భూ కుంభకోణానికి పాల్పడిన మంత్రి తన బినామీలతో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఇనాం భూములను దోచుకున్నారన్నారు. పిసినికాడలో 80ఎకరాల దళితుల అసైన్డ్ భూమిని తక్కువ ధరకు లాక్కున్నారన్నారు. జగనన్న కాలనీల్లో భూములను అమ్ముకున్నారని, కూటమి అధికారంలోకి రాగానే వీటన్నింటిపై విచారణ చేపడతామని హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం గురించి వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఆ పార్టీ నాయకులకు డ్యాన్స్‌లు వేయడం తప్ప సమాధానం చెప్పే సత్తా లేదన్నారు. పోలవరం పూర్తికి కేంద్ర సహాయం అవసరమని, ఇందుకోసం సీఎం రమేశ్ విజయం కీలకమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యలను పరిష్కరించుకుని, సొంత గనులు కేటాయించేలా చూస్తానన్నారు. అందరం కలిసి వస్తే ప్లాంట్ పరిరక్షణ సాధ్యమేనన్నారు.



బెల్లందిమ్మ చూపుతున్న పవన్ కల్యాణ్. చిత్రంలో అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, బుద్ధా నాగజగదీశ్వరరావు ఉన్నారు.



మర్రిపుట్టు సమీపంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

కనెక్టింగ్ రోడ్డు ఎప్పటికి పూర్తయ్యేనో?

సుమారు మూడేళ్లుగా నిలిచిన పనులు

- బిల్లులు మంజూరుకాకపోవడంతో నిలిపివేసిన కాంట్రాక్టరు
- గోమంగి, బొంగరం పంచాయతీ వాసులకు తప్పని ఇబ్బంది
- కిలో మీటరు మేర రోడ్డు నిర్మాణం జరగకపోవడంతో ఐదు కిలో మీటర్లు చుట్టూ తిరగాల్సిన దుస్థితి



రాళ్లు తేలిన కనెక్టింగ్ రోడ్డు

పెదబయలు, ఏప్రిల్ 7: కేవలం కిలో మీటరు మేర కనెక్టింగ్ రహదారి నిర్మాణం జరగకపోవడంతో మండలంలోని గోమంగి, బొంగరం పంచాయతీల్లోని పలు గ్రామాల ప్రజలు ఐదు కిలో మీటర్లు చుట్టూ తిరిగి గమ్య స్థానానికి చేరుకోవలసిన దుస్థితి నెలకొంది. వైసీపీ ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం, అధికారులు ...మిగతా 6వ పేజీలో

మండిన సండే

- కొయ్యూరులో గరిష్ఠం 40.2, అనంతగిరిలో కనిష్ఠం 23.3 డిగ్రీలు
- ఎండల ధాటికి అల్లాడుతున్న గిరిజనం



పాడేరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మన్యంలో ఆదివారం భానుడు తీవ్ర ప్రతాపం చూసి గిరిజన జనాన్ని అల్లాడించాడు. గతానికి భిన్నంగా ఎండ తీవ్రంగా కాసింది. దీంతో మధ్యాహ్నం వేళల్లో జనం బయటకు వచ్చేందుకు సైతం భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

శనివారం నుంచి ఏజెన్సీలో సైతం వడగాల్పులు మొదలుకావడంతో రక్షణ లేకుండా బయట సంచరించలేని దుస్థితి నెలకొంది. ఆదివారం విపరీతమైన వేడిమికి జనం నానా ఇబ్బందులు పడ్డారు. ఆదివారం కొయ్యూరులో అత్యధికంగా గరిష్ఠ ఉష్ణోగ్రత 40.2 డిగ్రీలు, అనంతగిరిలో కనిష్ఠ ఉష్ణోగ్రత 23.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. వారం క్రితం వరకు ఏజెన్సీలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలలోపు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలలోపు మాత్రమే ఉండేవి. కానీ ఈ వేసవి మరింత ప్రభావితంగా ఉండడంతో ఎండలు మండుతున్నాయి. దీంతో చింతపల్లిలో గరిష్ఠ 37.2 - కనిష్ఠ 17.6, అరకులోయలో 36.3- 18.5, పెదబయలులో 36.6- 19.1, కొయ్యూరులో 40.2- 21.3, జి.మాడుగులలో 38.4- 22.3, అనంతగిరిలో 34.5- 23.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఉలిక్కిపడిన ఫార్మా సిటీ

- వేర్వేరు ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదం
- ఇద్దరి మృతి, నలుగురికి అస్వస్థత
- మరో ముగ్గురికి స్వల్ప గాయాలు

-వార్త 6వ పేజీలో..

ఇలా చేస్తే కాఫీ అధిక దిగుబడులు

- వేసవి సస్యరక్షణ కీలకం
- ఎండు, పొడవైన కొమ్మలు తొలగించుకోవాలి
- నాట్లు కోసం గోతులు సిద్ధం చేసుకోవాలి
- ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్ సూచన

చింతపల్లి, ఏప్రిల్ 7: జిల్లాలో ఆదివాసీ రైతులు నాణ్యమైన కాఫీ దిగుబడులు సాధించేందుకు వేసవి సస్య రక్షణ చాలా కీలకమని చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గిరిజన ప్రాంతంలో ఆదివాసీ రైతులు సంప్రదాయేతర ప్రధాన వాణిజ్య పంటగా కాఫీ సాగు చేపడుతున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం గిరిజన రైతులు 2.42 లక్షల ఎకరాల్లో కాఫీ సాగు చేపడుతున్నారు. ఆదివాసీ రైతులు కాఫీ సాగులో వేసవి సస్యరక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్ల ఆశించిన దిగుబడి పొందలేకపోతున్నారని ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



పూతకొచ్చిన కాఫీ తోట (ఫైల్ ఫొటో)



ఎండు కొమ్మలను తొలగిస్తున్న గిరిజన మహిళలు

ప్రస్తుతం రైతులు తోటల్లో కాఫీ పండ్ల కోత పనులు పూర్తి చేసుకున్నారు. ఈ నెలలో కురిసే తొలకరి వర్షాలకు కాఫీ మొక్కల్లో పూత కూడా ప్రారంభంకానున్నది. రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు వేసవిలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్ పలు సూచనలు చేశారు.

ఫైర్‌లైన్ క్లియరెన్స్

వేసవిలో కాఫీ తోటలు అగ్నిప్రమాదానికి గురికాకుండా రైతులు ఫైర్‌లైన్ క్లియరెన్స్ పనులను చేసుకోవాలి. కాఫీ తోట నలుదిక్కులా ఎండిపోయిన ఆకులు, కొమ్మలను తొలగించుకోవాలి. కనీసం కాఫీ తోటల అంచుల చుట్టూ మూడు అడుగుల విస్తీర్ణం కలిగిన బాటలను ఏర్పరచుకుని ఎండు ఆకులు, ఎండు కొమ్మలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కాఫీ తోటలు కలిసి వుంటే ప్రతీ తోట మధ్యలో మూడు అడుగులు వెడల్పు ... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమ)	6.14
సహరి (మంగళ)	4.36

టెన్త్ మూల్యాంకన కేంద్రంలో ఏర్పాట్లపై ఆరా



టెన్త్ మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ సునీత

- పరిశీలించిన కలెక్టర్ విజయ సునీత

పాడేరురూరల్, ఏప్రిల్ 7: పాడేరులోని తలారిసింగి సీపీహెచ్‌లో ఏర్పాటు చేసిన టెన్త్ మూల్యాంకన కేంద్రాన్ని కలెక్టర్ విజయ సునీత ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులతో మాట్లాడి ఏర్పాట్లు, సమస్యలపై ఆరా తీశారు. ఉపాధ్యాయులను, సౌకర్యాలు కల్పించిన క్యాంప్ ఆఫీసర్, డీఈవో పి.బ్రహ్మాజీరావును అభినందించారు. ఆమె వెంట డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ వినయ్ మోహన్, అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్, సిబ్బంది ఉన్నారు.



పాడేరు మండలం మినుములూరు వద్ద వరి పంటకు రక్షణగా చీరలు చుట్టిన దృశ్యం

వరి పంట చీర కట్టింది

ఎక్కడైనా పంటలను రక్షించేందుకు కంచెలు వేయడం సహజం. కానీ అందుకు భిన్నంగా పాడేరు మండలం మినుములూరు ప్రాంతంలో గిరిజన రైతులు తమ వరి పంట రక్షణకు పాత చీరలనే కంచెలా చుట్టారు. ఈ చిత్రాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది. -ఆంధ్రజ్యోతి/పాడేరు

క్రైం... crime news

తురువోలులో జీడిమామిడి తోటలు దగ్ధం


తురువోలులో దగ్ధమైన జీడిమామిడితోట

చీడికాడ, ఏప్రిల్ 7: మండలంలోని తురువోలు గ్రామంలో ముగ్గురు రైతులకు చెందిన జీడి మామిడితోటలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.5లక్షల వరకు నష్టం ఉంటుందని అంచనా. గ్రామానికి చెందిన పోతల సూర్యం, గొర్రుపోటు అప్పలనాయుడు, గొర్రుపోటు పైడితల్లిబాబులకు చెందిన జీడిమామిడితోటల్లో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు అగ్నిమంటలు చెలరేగాయి. స్థానికులు సమాచారం మేరకు చోడవరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపుచేసింది. అప్పటికే సుమారు రెండు ఎకరాల్లో పంట దగ్ధమైంది. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

1,800 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం


సారా బట్టీలపై దాడి చేసిన ఎస్ఈబీ సిబ్బంది

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 7: బుచ్చెయ్యపేట, దేవరాపల్లి మండలాల్లో ఎస్ఈబీ అధికారులు నిర్వహించిన దాడుల్లో 1,800 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. బుచ్చెయ్యపేట మండలం ఆర్. శివరాంపురంలో సారా బట్టీలపై దాడి చేసి వెయ్యి లీటర్ల బెల్లం పులుసును ఎక్సైజ్ శాఖ పోలీసులు ధ్వంసం చేశారు. చోడవరం ఎస్‌హెచ్‌ఓ (ఎస్ఈబీ) బీహెచ్. కిరణ్ మహేశ్వరి ఆధ్వర్యంలో ఎస్ఐ పి.అప్పారావు, సిబ్బంది దాడి చేసి ప్లాస్టిక్ డ్రమ్‌ల్లో నిల్వచేసిన బెల్లం పులుసును పారబోశారు. దేవరాపల్లి మండలం వాకపల్లి గ్రామంలో సారా తయారీకి నిల్వచేసిన 800 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేసినట్టు ఎస్‌హెచ్‌ఓ కిరణ్ మహేశ్వరి తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ చోరీ


ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలుగొట్టిన దృశ్యం

నక్కపల్లి, ఏప్రిల్ 7: మండలంలోని కాగిత గ్రామంలో వ్యవసాయానికి కరెంటు సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌లో వున్న కాపర్ (రాగి వైరు)ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఈ మేరకు స్థానిక ఏఈ కృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కాగిత గ్రామంలో వ్యవసాయ బోర్లకు విద్యుత్‌ను సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌ను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. ఆదివారం ఉదయం స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఏఈ కృష్ణ, సిబ్బంది పరిశీలించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్టు ఏఈ చెప్పారు.

ప్రభుత్వ భూమిలో కాంపౌండ్ వాల్ నిర్మాణం

▸▸ అడ్డుకున్న స్థానికులు


పైడివాడఅగ్రహారంలో లే-అవుట్ యజమానితో వాగ్వాదం చేస్తున్న గ్రామస్థులు

సబ్బవరం, ఏప్రిల్ 7 : మండలంలోని పైడివాడఅగ్రహారంలో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేస్తున్న కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని స్థానికులు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకెళ్లగా ఎన్నికలు ముగిసే వరకూ కాంపౌండ్ వాల్ నిర్మించవద్దని చెప్పినా రియల్టర్ దౌర్జన్యంగా కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారని స్థానికులు ఆదివారం పనులు అడ్డుకున్నారు. ఎంపీటీసీ సభ్యుడు శీరం అప్పలరాజు, టీడీపీ నాయకులు అక్కిరెడ్డి దుర్గినాయుడు తదితరులు మాట్లాడుతూ.. పైడివాడ అగ్రహారం సర్వే నంబర్ 1లో గతంలో ఎన్టీఆర్ కాలనీ మంజూరు చేయగా, తాజాగా వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీ మంజూరు చేసిందన్నారు. ఈ రెండు కాలనీలకు లంకెలపాలెం-అనకపల్లి రోడ్డు నుంచి సర్వే నంబరు 1 ప్రభుత్వ భూమి నుంచి 40 అడుగుల మార్గం ఇచ్చారన్నారు. రీ సర్వేలో సదరు రోడ్డు స్థలం ఎరుకునాయుడుపాలెం రెవెన్యూ పరిధిలో జిరాయితీలో కలిసి ఉందని, ఆ భూమి కొన్న రియల్టర్ వాదిస్తున్నారన్నారు. సదరు రోడ్డును ఆక్రమించి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి కొన్ని రోజులుగా ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు.ఇప్పటికే కొంత ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్రహరీ నిర్మించాడని, మిగతా చోట కూడా నిర్మాణం చేస్తుండగా అడ్డుకున్నామన్నారు. రెవెన్యూ సిబ్బంది స్పందించి రోడ్డు మార్గం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొత్త అమావాస్య జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7: స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఏర్పాట్లను ఆదివారం జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులను ఆదేశించారు. ఆలయ పరిసరాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై డీఎస్పీ ఎస్. అప్పలరాజు, పట్టణ సీఐ జి. శంకరరావు, ట్రాఫిక్ సీఐ పి. పైడపునాయుడు, ఆలయ ఈవో బండారు ప్రసాద్‌లకు భద్రతాపరమైన సూచనలు చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంలో దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు కూడా ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలన్నారు. అనంతరం ఎస్పీ అమ్మవారిని దర్శించుకోగా అర్చకులు ఆశీర్వాదం అందజేశారు.


చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	405
విజయనగరం	409
శ్రీకాకుళం	409

అపూర్వ స్వాగతం

జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు అనకాపల్లి వాసులు ఘన స్వాగతం పలికారు. వారాహి విజయభేరి యాత్రలో భాగంగా ఆదివారం పట్టణంలో జనసేనాని పర్యటించారు. అడుగడుగునా మహిళలు హారతులు పట్టారు. దారిపొడవునా మహిళలు, యువకులు పుష్పవర్షం కురిపించారు. గాజు గ్లాస్ గుర్తును మహిళలు ప్రదర్శించారు. జనాదరణ చూసి పవన్‌కల్యాణ్ మురిసిపోయారు. పవన్‌కల్యాణ్ వారాహి యాత్రను చాలా మంది తమ సెలఫోన్లలో బంధించారు. టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు, బొకేలతో పవన్‌కల్యాణ్‌ను సత్కరించారు.


అనకాపల్లి రోడ్‌షోలో కార్యకర్తలకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అభివాదం




జనసేన ఫ్లెక్సీతో చెట్టెక్కిన అభిమాని


పవన్‌కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం రమేశ్


పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న కొణతాల రామకృష్ణ


పవన్‌కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న బుద్ధా నాగజగదీశ్వరరావు


టీడీపీ, జనసేన, బీజేపీల జెండాలతో అభిమాని


చిన్నారితో జనసేన అధినేత పవన్‌కల్యాణ్


రోడ్‌షోలో పవన్‌కల్యాణ్ అభివాదం



పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీతో అభిమానులు


గాజు గ్లాసు గుర్తుతో మహిళలు


ఆర్టీసీ బస్సు లోపల నుంచి పవన్‌కల్యాణ్‌ను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న ప్రయాణికులు


పవన్‌కల్యాణ్‌ను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న మహిళలు

పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరికలు




పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన తోట నగేష్, సకల గోవిందరావు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7 : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు నేతలు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. జలగలమదుం జంక్షన్ సమీపంలోని హెలీప్యాడ్ వద్ద జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, అనకాపల్లి వైసీపీ నాయకులు సకల గోవిందరావు, రాష్ట్ర ఫిషర్ మాన్ జేఏసీ చైర్మన్ కంబాళి అమ్మోరయ్య, రాంబిల్లి మండలం సీతపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు డీఎస్ఎన్ రాజు (బుజ్జి), ఏటికొప్పాక ఎంపీటీసీ సభ్యుడు అన్నం వెంకట్రావు, కశింకోట మండలం పరవాడపాలెం సర్పంచ్ ముసలినాయుడు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నట్టు జనసేన పార్టీ కార్యాలయం తెలిపింది.

నీలగిరి.. అక్రమార్కులకు సిరి..!

▸▸ పెడిమికొండ రిజర్వు ఫారెస్టులో మాయమవుతున్న చెట్లు
▸▸ పట్టించుకోని అటవీ శాఖ అధికారులు
▸▸ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వనసంరక్షణ సమితి సభ్యులు

కష్టం ఒకరిది.. ప్రతిఫలం మరొకరిది అన్న నానుడిని అక్రమార్కులు బాగా వంటపట్టించుకున్నారు. అందుకే ఎక్కడైనా ఏపుగా పెరిగిన చెట్టు కనిపించినా.. గెడ్డలు, నదుల్లో ఇసుకను చూసినా.. ఇలా ఏది వారికంట పడినా కాజేస్తుంటారు. అందునా ప్రభుత్వ ఆస్తులైతే రెక్కలు కట్టుకుని మరీ వాలిపోతుంటారు. వీరిని కట్టడి చేయాల్సిన అధికారులు కళ్లకు గంతలు కట్టుకుంటుండడంతో మరింత రెచ్చిపోతున్నారు. ఇప్పుడు ఇలాంటివారే రెండు దశాబ్దాలకు పైబడి వన సంరక్షణ సమితి సభ్యులు పెంచుకున్న చెట్లను గుట్టుగా నరుక్కుని పోతూ జేబులు నింపుకుంటున్నారు.


పెడిమికొండ రిజర్వు ఫారెస్టులో గాంధీనగరం వీఎస్ఎస్ సభ్యులు పెంచిన నీలగిరి చెట్లు

నాతవరం, ఏప్రిల్ 7 : మండలంలోని పెడిమికొండ రిజర్వుఫారెస్టులో నీలగిరి (యూకలిప్టస్) చెట్లు మాయమవుతున్నాయి. 2001లో అటవీ శాఖ అధికారులు ఈ మొక్కలను సరఫరా చేయగా, అప్పటి వన సంరక్షణ సమితి చైర్మన్ కొత నూకరాజు ఆధ్వర్యంలో వన సంరక్షణ సమితి సభ్యులు 25 ఎకరాలలో వీటిని నాటారు. ఇవి పెద్ద చెట్లుగా పెరిగిన తర్వాత నరికి ఆ కలప విక్రయించగా వచ్చిన ఆదాయంలో సగం అటవీ శాఖకు, సగం గాంధీనగరం గ్రామాభివృద్ధికి వినియోగించాలని అప్పట్లో ఒప్పందం కుదిరినట్టు గ్రామస్థులు చెపుతున్నారు. ప్రస్తుతం ఇవి ఏపుగా పెరిగాయి. ఇదిలావుంటే, అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగా ఈ తోటలో చెట్లను అక్రమార్కులు అక్కడక్కడా నరుక్కుని తరలించుకుపోతున్నారు. నాతవరం మండలం తుని- నర్సీపట్నం రూట్‌లో గాంధీనగరం దగ్గర ఈ నీలగిరి తోటలు ఉండగా చివరిలో చెట్లను కొందరు గుట్టుగా నరుక్కుని పోతున్నట్టు పలువురు చెపుతున్నారు. అయినప్పటికీ అటవీ శాఖ అధికారుల్లో చలనం లేకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సదరు అధికారులు స్పందించి ఈ చెట్లను నరికించేందుకు టెండర్లను ఆహ్వానించాలని, వాటిని విక్రయించగా వచ్చిన ఆ ఆదాయంలో సగం అటవీశాఖకు, మిగిలిన సగం గాంధీనగరం గ్రామాభివృద్ధికి ఉపయోగిస్తే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు. మరీ ఆలస్యం చేస్తే మరిన్ని చెట్లను అక్రమార్కులు నరుక్కుని పోవడం ఖాయమని అంటున్నారు. ఈ అంశాన్ని నాతవరం మండల అటవీ శాఖాధికారి మహేష్ వద్ద ప్రస్తావించగా, నిబంధనల మేరకు టెండర్లను ఆహ్వానిస్తామన్నారు.




చెట్లను నరుక్కుపోతుండడంతో మిగిలిన మోళ్లు

పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగ, ఉపాధి కల్పిస్తా

▸▸ బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7 : అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో పరిశ్రమలు ఏర్పాటు చేయించి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తానని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. ఆదివారం గాంధీనగరంలో జరిగిన వెలమ సంక్షేమ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడ తాను ఎంపీగా ఎన్నికైతే పార్లమెంట్ నియోజకవర్గంలో రూ. ఆరు వేల కోట్లతో అభివృద్ధి చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. అనకాపల్లిలోనే ఉండి తన స్వగ్రామంలా మార్చుకుంటున్నానన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల రీత్యా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మాత్రమే అభివృద్ధి చేసి చూపించగలదన్నారు. వెనుకబడిన అనకాపల్లి ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికే బీజేపీ పెద్దలు నన్ను అనకాపల్లికి పంపించారన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు పలు విషయాలను సీఎం రమేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు, బీజేపీ నాయకులు పీవీఎస్ మాధవ్, సురేంద్రమోహన్, ఈర్లె శ్రీరామ్మూర్తి, పరుచూరి భాస్కరరావు, డి.పరమేశ్వరరావు, సంఘ ప్రతినిధులు బీమా, రాజాన అప్పారావు, రాజేంద్రప్రసాద్, పీఎస్ నాయుడు, పెదపాటి కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు నష్టపరిహారానికి అంగీకారం

పరవాడ, ఏప్రిల్ 7: ఫార్మాసిటీలోని ఆల్కలీ మెటల్స్, అపిటోరియా పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో మృతి చెందిన సీహెచ్. రమణ, ఆళ్ల గోవింద కుటుంబాలకు యాజమాన్యాలు నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించాయి. ఈ మేరకు ఆదివారం మృతుల కుటుంబసభ్యులతో యాజమాన్యాలు చర్చలు జరిపాయి. ఆల్కలీ పరిశ్రమ యాజమాన్యం సీహెచ్. రమణ కుటుంబానికి రూ.35 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించాయి. అలాగే అపిటోరియా పరిశ్రమ యాజమాన్యం ఆళ్ల గోవింద్ కుటుంబానికి రూ. 32 లక్షలు నష్టపరిహారంతోపాటు దహన సంస్కార ఖర్చులు నిమిత్తం రూ. 50వేలు అందజేసింది. ఈ కార్యక్రమంలో ఫార్మా యాజమాన్యాల ప్రతినిధులు కమలాకర్‌రెడ్డి, రామకృష్ణ, శర్మ, రవిశంకర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో సత్యసాయిబాబా సేవా బృందం భక్తి గీతాలు ఆలపిస్తున్న దృశ్యం

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం

పాడేరు రూరల్, ఏప్రిల్ 7: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, గిరిజన ప్రాంత ప్రజల ఇలవేల్పు పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 6 గంటల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి క్యూ కట్టారు. మన్యంలోని వివిధ గ్రామాల ప్రజలతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి సన్నిధిలోనే కుటుంబ సభ్యులతో కలిసి పండగలను జరుపుకున్నారు. సత్య సాయిబాబు సేవా బృంద సభ్యులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలను చేపట్టారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారి సన్నిధిలో భక్తిగీతాలన ఆలపించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో ప్రసాద కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, పోతురాజు, కొండలరావు, శ్రీనివాస్‌కుమార్ తదితరులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

'సంఘ వ్యతిరేక శక్తులకు దూరంగా ఉండాలి'



గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్ఐ అప్పలసూరి

చింతపల్లి, ఏప్రిల్ 7: గిరిజనులు సంఘ వ్యతిరేక శక్తులకు దూరంగా ఉండాలని జీకే వీధి ఎస్ఐ అప్పలసూరి సూచించారు. కొయ్యూరు-జీకే వీధి మండలాల సరిహద్దులోని పనసపల్లి గ్రామంలో ఆదివారం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీలతో ఎస్ఐ మాట్లాడుతూ మావోయిస్టు కార్యకలాపాలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరించవద్దని సూచించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆదివాసీలు నిర్భయంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రతీ ఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చి స్వేచ్ఛగా ఓటు వేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఈ నెల 15వ తేదీలోగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



2కే రన్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

చింతపల్లి, ఏప్రిల్ 7: ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి అవసరం ఎంతైనా ఉందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి చెప్పారు. స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని 2కే రన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కాలంతో పాటు మానవుల ఆహారపు అలవాట్లు, జీవన విధానంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం, జీవన విధానం పాటించకపోవడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. అందువల్ల సమతుల ఆహారం తీసుకోవడంతో పాటు ప్రతీ రోజు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'టీడీపీకి బీసీలు వెన్నుముఖ లాంటివారు'

ఎటపాక, ఏప్రిల్ 7: టీడీపీకి బీసీలు వెన్నుముఖలా నిలుస్తున్నారని రంపచోడవరం ఎన్డీఏ కూటమి అభ్యర్థిని మిరియాల శిరీషాదేవీ చెప్పారు. ఆదివారం గుండాల కాలనీ గ్రామంలో జయహో బీసీ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీషాదేవి మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే బీసీలకు పెద్ద పీట వేశారన్నారు. బీసీలకు 30 రకాల సంక్షేమ పథకాలను టీడీపీ అమలు చేస్తే, వైసీపీ వచ్చాక వాటిని ఆటకెక్కించారని విమర్శిం చారు. బీసీలకు ఎవరు మేలు చేశారో బీసీలు ఆలోచించాలని సూచించారు. పోలవరం నిర్వాసితులు ఇళ్లు ఖాళీ చేసే సమయంలో 18 ఏళ్లు నిండిన ప్రలా ఒక్కరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రంపచోడవరం పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, వైఎస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, టీడీపీ నాయకులు కిలారి వెంకటేశ్వరరావు, రావి మాధవావు, శ్రీకాంత్ చౌదరి, ఎన్డీఏ కూటమి నాయకులు పాయం వెంకయ్య, నోముల రామారావు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల విజయం ఖాయం

టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రావణ్

పాడేరు రూరల్, ఏప్రిల్ 7: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థుల విజయం ఖాయమని తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. పాడేరు కేవీఆర్ ఫార్చ్యూన్‌లో పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కిల్లు వెంకట రమేష్‌నాయుడు ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రావణ్ మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి రమేష్‌నాయుడు విజయం తథ్యమన్నారు. వైసీపీ అరాచకాలపై మూడు పార్టీలు ఏకం కావడం శుభపరిణామన్నారు. మద్యం, ఇసుక మాఫియాను నడిపి రాష్ట్రాన్ని దోచుకోవడంతో పాటు పంచాయతీలకు కేటాయించిన నిధులను సైతం దారి మళ్లించి రాష్ట్రంలో అభివృద్ధి జాడ లేకుండా వైసీపీ చేసిందని దుయ్యబట్టారు. జీవో నంబరు-3ను రద్దు చేసి గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేసిందన్నారు. ఉమ్మడి ప్రభుత్వం రాగానే జీవో నంబరు-3ను పునరుద్ధరించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పాడేరు నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామంలోనైనా సీసీ రోడ్లు నిర్మించా? గృహ నిర్మాణాలు చేపట్టారా? అని ఆయన ప్రశ్నించారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేస్తామన్నారు. అరకు పార్లమెంట్ అభ్యర్థి కొత్తపల్లి గీతకు, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి పాంగి రాజారావుకు కమలం గుర్తుపైన, పాడేరు టీడీపీ అభ్యర్థి కిల్లు రమేష్‌నాయుడుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించేందుకు కేడర్ కంకణం కట్టుకోవాలన్నారు. టీడీపీ అభ్యర్థి రమేష్‌నాయుడు మాట్లాడుతూ తనకు టికెట్ కేటాయించిన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, పార్టీ ముఖ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు ఉల్లి రామారావు, బాకూరు వెంకటరమణరాజు, బొంజుపడాల్, కూడా కృష్ణారావు, పి.రవికుమార్, సల్లా రామకృష్ణ, పాపిటిరాజు, పి.రవిచంద్ర, కె.వెంకటరమణ, బి.స్వర్ణలత, కమలహాసన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రావణ్

కూటూరు సంఘటనపై గిరిజనాగ్రహం

కూనవరం, ఏప్రిల్ 7: వైసీపీ ప్రచారంలో శనివారం జరిగిన కూటూరులో ఇద్దరు గిరిజనులు గాయాల పాలుకావడంతో గిరిజన సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అధికార మత్తులో వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అమాయక గిరిజనులపై దాడి చేయిస్తున్నారన్నారు. జరిగిన సంఘటనపై ఎన్నికల కమిషన్ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సంఘటనపై గిరిజనులంతా ఏకం కావాలని ఎమ్మెల్సీ అనంతబాబుపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్ ప్రకటించారు. బీజేపీ నాయకులు పాయం వెంకయ్య సైతం కూటూరు సంఘటనపై పూర్తి విచారణ జరిపించి దోషులను శిక్షించాలన్నారు. టీడీపీ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి మాట్లాడుతూ కేసును పోలీసులు పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇద్దరు గిరిజనులకు తీవ్ర గాయాలైనప్పటికీ తోపులాటలో గాయమైనట్టు చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సంఘటనపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పొడియం అప్పారావు, గడేసుల ప్రేమ్‌చంద్, రసూల్, వెంకటేష్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజన సంఘాల నేతలు

బాధితులకు శిరీష పరామర్శ

కూటూరు సంఘటనలో గాయపడ్డ రాము, వినోద్‌లను రంపచోడవరం టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీష పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమాయక గిరిజనులపై దాడి చేసిన వైసీపీ నాయకులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

మోదకొండమ్మ జాతర ప్రచార పోస్టర్ ఆవిష్కరణ రేపు



పాడేరు రూరల్, ఏప్రిల్ 7: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ జాతర ప్రచార పోస్టర్‌ను ఉగాది పర్వదినమైన మంగళవారం ఉదయం 9 గంటలకు ఆవిష్కరిస్తామని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు తెలిపారు. వచ్చే నెల 19, 20, 21వ తేదీలలో జరగనున్న అమ్మవారి ఉత్సవానికి సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆలయ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పర్యవేక్షణలో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించనున్నట్టు చెప్పారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘ నాయకులు, గ్రామ, వర్తక సంఘ పెద్దలు, రాజకీయ పార్టీల నాయకులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ముగిసిన నూకాంబిక జాతర

చింతపల్లి, ఏప్రిల్ 7: మండలంలోని గొందిపాకలు నూకాంబిక జాతర ఆదివారం అంగరంగ వైభవంగా ముగిసింది. అమ్మవారికి ఘటాలు, పాదాలను గ్రామ పురవీధుల్లో భక్తులు సంప్రదాయబద్ధంగా ఊరేగించారు. భజన బృందంతో పాటు గ్రామదేవత ఆలయ ప్రాంగణంలో రచ్చ బండను నిర్మించిన జడ్పీటీసీ సభ్యుడు బాలయ్యను ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. అనంతరం తాజంగి దొంతులమ్మ భక్త భజన బృందం భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జనసేనానికి నీరాజనం

... 3వ పేజీ తరువాయి

వెలిగించి పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలికారు. సత్యనారాయణ థియేటర్ వద్ద ఒక చంటి బిడ్డను పవన్‌కల్యాణ్ ముద్దాడారు. ఈ ర్యాలీలో మార్గమధ్యంలోని కుంచావారి గౌరీ పరమేశ్వరులు, వేల్పులవీధి గౌరీపరమేశ్వరులను వాహనం పైనుంచే దర్శించుకున్నారు. ర్యాలీ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు దారి పొడవునా బందోబస్తు నిర్వహించారు.



అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణతో కలిసి అభివాదం చేస్తున్న పవన్ కల్యాణ్

కొర్రాలో గ్యారెంటీ పథకాలపై కాంగ్రెస్ ప్రచారం

డుంబ్రిగుడ, ఏప్రిల్ 7: మండలంలోని కొర్రా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్యారెంటీ పథకాలపై ఆదివారం ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి శాంతకుమారి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో వస్తే పేద గిరిజనులకు రూ.5 లక్షలతో సొంత ఇల్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. అలాగే ఉపాధి రోజు వారి కూలి రూ.400 వచ్చేలా కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించి ఇందిరమ్మ రాజ్య స్థాపనకు అంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సోమేశ్వరరావు, వెంకటబాబు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఇలా చేస్తే కాఫీ అధిక దిగుబడులు

... 3వ పేజీ తరువాయి

కలిగిన ఫైర్‌లైన్ క్లియరెన్స్ పనులు చేసుకోవాలి.

కొమ్మల కత్తిరింపు

కాఫీ సాగులో కొమ్మల కత్తిరింపు చాలా కీలకం. ఏప్రిల్, మే నెల్లో కాఫీ మొక్కలపైన కొత్తగా వచ్చిన నిటారు లేతకొమ్మలను ఏటవాలుగా కత్తిరించుకోవాలి. అలాగే అడ్డదిడ్డంగా (ఒక కొమ్మపై మరో కొమ్మ కలిగి వుంటే)వున్న కొమ్మలను కూడా కత్తిరించుకోవాలి. ఈ కొమ్మలపై వచ్చిన నిటారు(గుర్రపు డెక్క) కొమ్మలను కూడా కత్తిరించుకోవాలి. ప్రతీ కొమ్మకు కాంతి తగిలేలా చూసుకోవాలి. ఎండు కొమ్మను కూడా తొలగించుకోవాలి. ఒక మొక్కలో 12-13 బలమైన దిగుబడినిచ్చే కొమ్మలు మాత్రమే వుండేలా చూసుకోవాలి. ఈ విధంగా కొమ్మల కత్తిరింపు పనులు చేసుకోవడం వల్ల దిగుబడినిచ్చే కొమ్మలకు పోషకాలు పూర్తిస్థాయిలో అందుతాయి. దీంతో కాఫీ దిగుబడి పెరుగుతుంది. నేల నుంచి రెండు అడుగులలోపు ప్రధాన కాండానికి ఇరువైపులా కొమ్మలు లేకుండా చూసుకోవాలి.

కలుపు నివారణ, అంతర్ కృషి

కాఫీ తోటల్లో కలుపు (అనవసరమైన మొక్కలు)ను తొలగించుకోవాలి. అలాగే మూడేళ్లలోపు మొక్కల చుట్టూ గొప్పుచేసుకుని గూడు కట్టుకోవడం మంచిది. మూడేళ్లలోపు మొక్కలకు రెండు కిలోల పశువుల గెత్తం వేసుకోవాలి. అలాగే నాలుగేళ్ల పైబడిన ఒక్కొక్క మొక్కకు ఐదు కిలోల పశువుల గెత్తం వేసుకొని మొక్కల చుట్టూ గొప్పుచేసుకోవాలి.

కాండంతొలుచు పురుగు నివారణకు..

కాఫీ మొక్కలకు సరైన నీడ లేకపోతే కాండం తొలుచు పురుగు ఆశిస్తుంది. మొక్కలపై ఎండ ప్రభావం ఎక్కువగా వుంటే ఈ పురుగు వ్యాప్తి అధికంగా వుంటుంది. ఈ పురుగు ప్రధానంగా మొక్క ప్రధాన కొమ్మపై వేల సంఖ్యలో గుడ్లు పెడుతుంది. ఈ గుడ్ల నుంచి వందల సంఖ్యలో కాండం తొలుచు పురుగులు బయటకొచ్చి పంటను నాశనం చేసే ప్రమాదముంది. ఈ సమస్యను అధిగమించేందుకు రైతులు మొక్కల ప్రధాన కాండం కింద నుంచి పైభాగం వరకూ కొబ్బరిపీచు, గోనె సంచితో నునుపుగా చేసుకోవాలి. కాండాన్ని నునుపుగా చేసుకోవడం వల్ల కాండం తొలుచు పురుగు మొక్కకాండంపై గుడ్లుపెట్టినా అవి మొక్క కిందకు రాలిపోతాయి. ఈ పురుగు ప్రధాన కాండానికి చిన్న రంధ్రం చేసుకుని లోపలకు ప్రవేశిస్తుంది. కాండంలోనున్న పోషకాలను పీల్చివేస్తుంది. కాండం తొలుచు పురుగు ఆశించిన మొక్కల నుంచి కాఫీ దిగుబడి రాదు. ఈ మొక్కలను రైతులు గుర్తించి పూర్తిగా తొలగించుకుని కాల్చివేయాలి. ఈ మొక్కల స్థానంలో కొత్తగా మొక్కలను నాటుకోవాలి. అలాగే కాఫీ తోటకు పూర్తి స్థాయిలో నీడను కల్పించేందుకు నీడనిచ్చే మొక్కలను పెంపొందించుకోవాలి.

బోర్డో మిశ్రమంతో తెగుళ్ల నివారణ

కాఫీ పంటలో తెగుళ్లను నివారించుకునేందుకు వేసవిలో బోర్డో మిశ్రమం పిచికారీ చేసుకోవాలి. ఈ మిశ్రమం పిచికారీ చేసుకోవడం వల్ల ఆకుమచ్చ తెగులు, పొలుసు పురుగు, కాండం తొలుచు పురుగులను నియంత్రించుకోవచ్చు. అలాగే 1500 సీపీఎం వేపనూనె 5 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటిలో కలుపుకుని మొక్కలపై పిచికారీ చేసుకోవాలి.

నాట్ల కోసం గుంతలు సిద్ధం చేసుకోవాలి



జూలై, ఆగస్టులో కాఫీ మొక్కలు నాట్లు వేసుకోవాలని ఆశించిన రైతులు ఇప్పుడే గుంతలను సిద్ధంచేసుకోవాలి. మొక్కలు, వరుసల మధ్య ఏడు అడుగుల ఎడం పాటిస్తూ 1.5 అడుగుల పొడవు, వెడల్పు, లోతు కలిగిన గోతులను తీసుకోవాలి. గుంత లోపల ఇతర వృక్షాల వేర్లు, రాళ్లు తొలగించుకోవాలి. 15 రోజుల తరువాత గుంత పైభాగం వరకూ మెత్తని మట్టిని నింపుకోవాలి. 2-3 రోజులు తరువాత ప్రతీ గుంతలో మూడు కిలోల పశువుల గెత్తం వేసుకోవాలి. జూలై, ఆగస్టు నెలల్లో 5-6 జతలు ఆకులు వచ్చిన సంచుల్లోనున్న కాఫీ మొక్కలను నాటుకోవాలి.

-డాక్టర్ శివకుమార్, ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి, చింతపల్లి

పాడేరు అసెంబ్లీ కాంగ్రెస్ టికెట్ సుబ్బారావుకు కేటాయించాలి

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 7: పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్ వంతల సుబ్బారావుకు కేటాయించాలని రింతాడ, వంచుల పంచాయతీ కార్యకర్తలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రింతాడలో ఆదివారం సాయంత్రం సమావేశమైన వారంతా సమావేశమయ్యారు. పార్టీ మనుగడ లేని కాలం నుంచి కాంగ్రెస్ బలోపేతానికి సుబ్బారావు ఎనలేని కృషి చేశారన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ముందుండి నడిపారన్నారు. ఈ క్రమంలో సుబ్బా రావును కాదని పార్టీలో కొత్తగా చేరిన సతక బుల్లిబాబుకు టికెట్ కేటాయించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్ఠానం పునరాలోచన చేయాలని వారు కోరారు. సమా వేశంలో మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆదివాసీ యువకులను తుపాకులతో కొట్టించడం దుర్మార్గం'

రంపచోడవరం ఏప్రిల్ 7: కూనవరం మండలం కూటూరు గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ ప్రజల సమస్యలు తెలుసుకోవాల్సింది పోయి, ఆదివాసీ యువకులను తుపాకులతో కొట్టించడం దుర్మార్గం అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోళ్ల బొజ్జిరెడ్డి అన్నారు. వైసీపీ పాలకులకు దళితులు, ఆదివాసీలు అంటే చులకనా అని, హంతకుడికి ఎన్నికల కోడ్‌లో ప్రచారానికి అనుమతి లేకుండా చర్యలు తీసుకోవాలని సోళ్ల బొజ్జి రెడ్డి కోరారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు.

ఉలిక్కిపడిన ఫార్మా సిటీ

» వేర్వేరు ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదం » ఇద్దరి మృతి, నలుగురికి అస్వస్థత » మరో ముగ్గురికి స్వల్ప గాయాలు

పరవాడ, ఏప్రిల్ 7: విశాఖ ఫార్మాసిటీ ఉలిక్కిపడింది. శనివారం అర్ధరాత్రి, ఆదివారం తెల్లవారుజామున వేర్వేరు పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. మరో నలుగురు అస్వస్థతకు గురికాగా, ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.



మృతుడు రమణ (ఫైల్ ఫొటో)



మృతుడు గోవింద (ఫైల్ ఫొటో)

ఆల్కలీ మెటల్స్ లిమిటెడ్ యూనిట్-3 పరిశ్రమలో మిథైల్ నైట్రేట్ గ్యాస్ లీక్ అవ్వడంతో కెమిస్ట్, సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సీహెచ్ రమణ(30) మృతి చెందగా, మరో నలుగురు అస్వస్థతకు గురయ్యారు. అలాగే అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-6 పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న ఆళ్ల గోవింద(32) మృతి చెందాడు. మరో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదాలకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఆల్కలీ పరిశ్రమలో..

ఆల్కలీ మెటల్స్ లిమిటెడ్ యూనిట్ -3 పరిశ్రమలో ఆదివారం తెల్లవారుజాము నాలుగున్నర గంటల ప్రాంతంలో ప్రొడక్ట్ బ్లాక్‌లోని జీజీ-2 ట్యాంక్ పైపులైన్ వద్ద మిథైల్ నైట్రేట్ గ్యాస్ లీకైంది. పైపులైన్‌కు సంబంధించి ఎల్ బెండ్ వద్ద లీకేజి కావడంతో సీ షిఫ్ట్ విధుల్లో ఉన్న సీహెచ్ రమణ (32) విపరీతంగా గ్యాస్ పీల్చడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. పైఫ్లోర్‌లో పనిచేస్తున్న కార్మికులకు గ్యాస్ వాసన రావడంతో కిందకు దిగి వచ్చి చూసేసరికి అప్పటికే రమణ అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. ఆస్పత్రికి తరలించే లోపు మార్గమధ్యంలో మృతి చెందాడు. అలాగే అతనిని చూసేందుకు వచ్చిన నలుగురు కార్మికులు ఎ.శ్రీనివాసరావు (పైడివాడ అగ్రహారం), వై.గోపాల్ (రేగడివలస), వి.అప్పారావు (లంకెలపాలెం), బి.రవీంద్ర (చోడవరం) అస్వస్థతకు గురయ్యారు. వెంటనే తోటి కార్మికులు వారిని తొలుత అనకాపల్లి ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి ప్రథమ చికిత్స అందజేశారు. మెరుగైన వైద్యం కోసం నలుగురిని విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం నలుగురు కోలుకున్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ ప్రమాదంలో మృతి చెందిన సీహెచ్ రమణ స్వస్థలం విజయనగరం జిల్లాలోని పూసపాటిరేగ మండలంలో గల గొల్లపేట గ్రామం. ఆయన భార్య సత్యవతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత 11 ఏళ్లుగా పరిశ్రమలో సూపర్‌వైజర్, కెమిస్ట్‌గా పనిచేస్తున్నారు. తానాంలో నివాసం ఉంటూ విధులకు హాజరవుతున్నారు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ పరిశ్రమను సందర్శించారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను కంపెనీ షిఫ్ట్ సూపర్‌వైజర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నలుగురి కార్మికుల పరిస్థితి గురించి వాకబు చేశారు.



ప్రమాదం జరిగిన ఆల్కలీ మెటల్ పరిశ్రమ ప్రధాన ద్వారం

అపిటోరియా పరిశ్రమలో..

అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-6 పరిశ్రమలో శనివారం అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో వీటీడీ డ్రయర్ రూములో ప్రమాదం చోటు చేసుకుంది. పరిశ్రమలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న ఆళ్ల గోవింద(32) డ్రయర్ రూము బోల్టు బిగించే క్రమంలో ఒక్కసారిగా డోర్ తెరుచుకుంది. దీంతో లోపల ఉన్న మిథైల్ నైట్రేట్ గ్యాస్ ఒక్కసారిగా రావడంతో పీల్చి కుప్పకూలిపోయాడు. ఈ క్రమంలో డ్రయర్ రూము డోర్ ఓపెన్ అయి శబ్దం రావడంతో సమీపంలో ఉన్న కిటికీ గ్లాస్ పగిలి అక్కడే పనిచేస్తున్న సూపర్‌వైజర్ బి.నరేంద్ర కంటికి తగలడంతో గాయమైంది. అలాగే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.బాబ్జీ, మరో ఫిట్టర్ బి. గోవింద స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా కుప్పకూలిన గోవిందను తొలుత అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతుని స్వస్థలం పాలకొండ. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పర్యవేక్షణలో సీఐ బాలసూర్యారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆల్కలీ పరిశ్రమలో మిథైల్ నైట్రేట్ గ్యాస్ లీకైన జీజీ-2 ట్యాంక్ ఇదే

పరిశ్రమలను సందర్శించిన అధికారులు

ప్రమాదం విషయం తెలుసుకున్న ఆర్డీవో చిన్నికృష్ణ, పరిశ్రమల అధికారి చిన్నారావు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ శాంతిభూషణ్, సీఐ బాలసూర్యారావు ప్రమాదాలు జరిగిన పరిశ్రమలను సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను యాజమాన్యాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందజేయాలని యాజమాన్యాలకు సూచించారు.

కనెక్టింగ్ రోడ్డు ఎప్పటికి పూర్తయ్యేనో?

... 3వ పేజీ తరువాయి

పట్టించుకోక పోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెదబయలు మండలం గోమంగి పంచాయతీ ప్రధాన రహదారి నుంచి మర్రిపుట్టు మీదుగా బొంగరం పంచాయతీలోని పలు గ్రామాలకు వెళ్లడానికి ఒక కిలో మీటరు మేర కనెక్టింగ్ రోడ్డును 2020 అక్టోబరు నెలలో ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులు రూ.70 లక్షలు ఇందుకు కేటాయించారు. కాంట్రాక్టరు ఈ మార్గాన్ని చదును చేసి కంకర వేశారు. 2021 మే నెల వరకు పనులు చేపట్టారు. అయితే బిల్లులు మంజూరుకాకపోవడంతో కాంట్రాక్టరు పనులను నిలిపివేశారు. ఆ తరువాత వర్షాలు కురిసి కంకర కొట్టుకుపోయింది. దీంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. పలు గ్రామాల ప్రజలకు రాకపోకలకు వీలు లేకుండా ఉంది. వీరంతా గోమంగి నుంచి బొంగరం పంచాయతీకి రావాలన్నా, ఇటు నుంచి అటు వెళ్లాలన్నా రహదారి సౌకర్యం లేక గుల్లెలు గ్రామం మీదుగా ఐదు కిలో మీటర్లు చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తోంది. జడ్పీటీసీ సభ్యుడి స్వగ్రామమైన గోమంగిలోనే రహదారి నిర్మాణం నిలిచిపోయి నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడు లేడని స్థానికులు అంటున్నారు. ఈ రహదారి ఎప్పటికి పూర్తవుతుందో అర్థంకావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.